క్లుప్తంగా

నేడు పీహెచ్‌సీ, పంచాయతీ భవనం ప్రారంభం

నిడమనూరు: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి రెడ్డి శనివారం ప్రారంభించనున్నట్లు పంచాయతీ ఇంజనీర్ ఏఈ సాయిప్రసాద్ తెలిపారు. నిడమనూరులో రూ.1.54 కోట్ల తో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఉపాధిహామీ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఆరోగ్యకేంద్రం కొత్త భవనంలో విశాలవంతమైన ఓపీ గది, ఆపరేషన్ థియేటర్లు, డాక్టర్లకు, వేర్వేరుగా నిర్మించారు. కొత్త పీహెచ్‌సీలో హోమియోపతి కేంద్రానికి ప్రత్యేక గది ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక

హాలియా : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు స్థానిక ఆకాంక్ష పాఠశాలకు చెందిన విద్యార్థి ఆర్ పవన్‌కుమార్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్స్‌పాల్ మోదాల రవీందర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 26న జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన సబ్ జూనియర్ 300మీటర్ల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన పవన్‌కుమార్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జూన్ 1న హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్ నిర్వహించంచే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి పవన్‌కుమార్‌ను పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, పీఈటీ ఆవుల చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

మిర్యాలగూడ టౌన్ : జూన్ 1న హైదరాబాద్‌లో బీసీల రాష్ట్రా స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, దేశ వ్యాప్తంగా సమగ్ర కుల గణన, భవిష్యత్ బీసీ ఉద్యమ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33జిల్లాల నుంచి బీసీ సంఘాల నేతలు, అనుబంధన నేతలు పెద్ద ఎత్తున తరలిరానున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు, దేశ వ్యాప్తంగా కులగణనలో సమగ్ర కులగణనపై చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశానికి బీసీలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ, ఎస్‌ఐ

వేములపల్లి : ఫర్టిలైజర్ దుకాణదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని ఏఓ కిశోర్‌నాయక్, ఎస్‌ఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను విక్రయిస్తే ఆ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసేటప్పుడు రశీద్ తీసుకోని పంటకాలం పూర్తయ్యేంతవరకు భద్రపరుచుకోవాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాడుగులపల్లి : మండలంలోని తోపుచర్ల గ్రామానికి చెందిన పలువురికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం ఆ గ్రామ శాఖ అధ్యక్షుడు గౌని నిరంజన్ అందజేశారు. ఆ గ్రామానికి చెందిన మంగ సైదులుకు రూ.46వేలు, ఎరెడ్ల జ్యోతికి రూ.26వేల సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరయ్యాయి. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంగ యాదయ్య, ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కట్ట శ్రీనివాస్‌రెడ్డి, బొప్పని లక్ష్మయ్య, మంగ నాగరాజు, రాచూరి యాదయ్య పాల్గొన్నారు.

శిథిల గృహాలపై దృష్టి!

- మున్సిపాలిటీలో గుర్తింపునకు క్షేత్రస్థాయి సర్వే
- ఇప్పటి వరకు 40 ఇళ్లు గుర్తింపు
- ప్రమాదాలు జరగకుండా ముందస్తు నోటీసులు జారీ



శిథిలావస్థలో ఉన్న ఇంటి యజమానికి నోటీసులు జారీ చేస్తున్న అధికారులు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో శిథిలావస్థలకు చేరిన గృహాలను గుర్తించేందుకు మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. వానా కాలం సమీపిస్తుండటంతో అధికారులు వీటిని గుర్తించి ప్రమాదాలు జరగకముందే చర్యలను చేపడుతున్నారు. కూలేందుకు సిద్ధంగా ఉండి ప్రమాదకరంగా ఉన్నవాటిని గుర్తించి ఆఇంటి యజమానులకు నోటీసలు అందజేస్తున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం మున్సిపాలిటీలో ఆ గృహాలు చిన్న చిన్న మైనర్ రిపేర్లు ఉంటే బాగు చేయించుకోవాలని, లేకుండా వాటిని తొలగించుకోవాలని మున్సిపల్ అధికారులు ఇప్పటికే నోటీసుల ద్వారా ఇంటి యాజమానులకు సూచిస్తున్నారు. పలు గృహాలకు ఒక వైపు పెచ్చులు ఉండటం, మరో వైపు కొంత కూలిపోవడంతో వర్షానికి నీరు పగులుడు ఉన్న గొడల్లోకి చేరి కూలే ప్రమాదం ఉంది. అయితే నాటి కాలంలో కట్టిన మిద్దెలు ఉండటంతో ఆ గృహాల్లోనే నివాసం ఉంటున్నారు. గతేడాది కూడా చాలా వరకు శిథిలావస్థలో ఉన్న గృహాలను మున్సిపల్ శాఖ అధికారులు ముందస్తు నోటీసుల ఇచ్చి డిస్మెంటల్ చేశారు. చాలా ఇల్లు మరమ్మతులు చేసుకొలేని స్థితిలో ఉన్నాయి.

చినుకు పడితే వణుకే..

మిర్యాలగూడ మున్సిపాలిటీలో చినుకు పడిందంటే వణుకుపుడుతుంది. సీతారాంపురం, పెద్ద బజారు, బంగారుగడ్డ, ప్రకాశ్‌నగర్, ముత్తిరెడ్డికుంట, బాపూజీనగర్, గొల్లగూడెం, తాళ్లగడ్డ, రవీంద్ర నగర్ కాలనీలతో పాటు తదితర ప్రాంతాల్లో శిథిలావస్థలోకి చేరుకున్న గృహాలు అధికంగా ఉన్నాయి. ఈ సమాచారం అధికారులకు అందడంతో అందులో భాగంగా పలు ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న మిద్దెల యజమానులకు నోటీసులు అందించారు. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో 30నుంచి 40గృహాలను ఇప్పటికే గుర్తించి నోటీసులు ఇచ్చారు. మిగిలిన వార్డుల్లో ఆయా వార్డులకు సంబంధించిన వార్డు ఆఫీసర్లు వార్డులను పర్యటించి పూర్తి స్థాయిలో సమగ్ర సమాచారాన్ని అందించాలనే మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ ఇప్పటికే వారికియా ఆదేశాలు జారీ చేశారు. దీంతో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజయ్యతో పాటు టీపీబీఓ తేజ తమ సిబ్బందితో కలిసి నోటీసులు అందిస్తున్నారు.

ముందస్తుగా చర్యలు



ప్రస్తుతం మున్సిపాలిటీలో శిథిలావస్థలో ఉన్న గృహాలను ఇప్పటి వరకు 30 నుంచి 40 వరకు గుర్తించాం. ఆ గృహ యాజమానులకు కలిసి ఏమైన మరమ్మతులు ఉంటే చేయించుకోవాలని, లేకుంటే ఆ గృహాలను ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశాం. అదే విధంగా ఇంకా చాలా వరకు వార్డుల్లో ఉండవచ్చు ఇప్పటిక వార్డు ఆఫీసర్లకు సూచనలు కూడా చేశాం.

– కట్టెబోయిన అంజయ్య, టీపీఎస్, మిర్యాలగూడ

ప్రకాశ్‌నగర్‌లో పునరావాసం

ప్రస్తుతం మున్సిపాలిటీలోని శిథిలావస్థలో ఉన్న గృహాలకు మరమ్మతులు చేయించుకోలేని స్థితిలో ఉంటే వారికి పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వర్షాభావా పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఒక వైపు ముంపు బాధితులు, మరోవైపు శిథిలావస్థలో ఉన్న గృహాల్లిని వృద్ధులకు పునరావాసం కల్పించనున్నారు. ప్రమాదకరంగా శిథిలావస్థలో ఉన్న గృహాల్లో ప్రమాదాలు జరకుండా ఉండేందుకు అధికారులు చర్యలను చేపట్టారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే బాలునాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, వేదికపై నాయకులు

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఆ పార్టీ మ ండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు ముఖాముఖి సమావేశంలో అయన మాట్లాడారు. మండల పరిధిలోని ఆయా పంచా యతీలు, తండాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడమే తన మందున్న లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. ప్రతి కార్యకర్తకు, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామినిచ్చారు. కొండభీమనపల్లి మాజీ సర్పంచ్ విద్యావతి వెంకట్‌రెడ్డి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సమావేశంలో నాయకులు సిరాజ్‌ఖాన్, శ్రీధర్‌రెడ్డి, నల్లగాసు జాన్‌యాదవ్, మారుపాకుల సురేష్‌గౌడ్, జూలూరి ధనలక్ష్మీ బాల నారాయణ, ఆలంపల్లి నర్సింహా, తిరందాసు కృష్ణయ్య, శిరందాసు కృష్ణయ్య, నాయకులు, కార్యకర్తలున్నారు.

మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలి



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న జేవీవీ నాయకులు

మిర్యాలగూడ : ప్రజలు మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకొని ఆరోగ్యంగా ఉండాలని జన వి/ఙ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కోల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం దామరచర్ల మండలంలోని బొల్లిగుట్టతండాలో ఉపాధి హామీ కూలీలకు వారి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వేసవి దృష్ట్యా కూలీలు వీలైనంత వరకు ఉదయం పనులు ముగించుకోవాలన్నారు. మార్కెట్‌లో దొరికే నూనెలకన్నా గానుగా ఆడించే వేరుశెనగ, నువ్వులు, కుసుమలు, కొబ్బరి వంటి నూనెలను వాడినట్లయితే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రజలు కల్తీ ఆహారంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వంచే గుర్తించబడిన జెనరిక్ మందులను వాడాలని, వాణిజ్య ప్రకటనలను చూసి మోసపోవద్దన్నారు. ప్రస్తుత శాస్త్ర సాంకేతిక యుగంలో మూఢనమ్మకాలను నమ్మవద్దన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో నవజ్యోతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ప్రముఖ నరాల వైద్యులు గోపాలం శివన్నారాయణ రోగుల నుంచి నెలకు రూ.75, నాలుగు నెలలకు కలిపి రూ.300 నామమాత్రంగా ఫీజు తీసుకోని 4నెలలకు సరిపడా మందులను అందజేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ పారేపల్లి సత్యనారాయణరావు, పాదూరి రమణారెడ్డి, గణేష్, బైరం శేఖర్, పంచాయతీ కార్యదర్శి కోల సాయికుమార్, ఎఫ్ఏ లాలు, పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి గొప్ప గుర్తింపు సాధించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌బీఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ ఉచిత వాలీబాల్ కోచింగ్ శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో రాణించి మిర్యాలగూడకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చిలుకూరు బలు, దేశిడి శేఖర్‌రెడ్డి, రుణాల్‌రెడ్డి, వెంకన్న, కొమ్ము శ్రీను, జానకిరాంరెడ్డి, నాగు నాయక్, అశోక్‌నాయక్, శరత్, నాగరాజు, మనోహర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

దేవరకొండ : ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు విక్రయించే వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని దేవరకొండ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్, పర్యావరణ ఇంజనీర్ సక్రు నాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని పలు హోల్‌సేల్ దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో ఉన్న ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విక్రయించకూడదని దుకాణాదారులకు సూచించారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట మున్సిపల్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

జాతీయ స్థాయి కరాటే పోటీలకు చిన్నారుల ఎంపిక



కరాటే పోటీలకు ఎంపికైన చిన్నారులతో మాస్టర్ శ్రీనివాస్

నిడమనూరు : ఖమ్మంలో నిర్వహించే జాతీయ స్థాయి కరాటే నిడమనూరు చిన్నారులు ఎంపికైనట్లు సుమన్ షాటోఖాన్ స్పోర్ట్స్ అకాడమి జిల్లా అధ్యక్షుడు పోతుగంటి శ్రీను తెలిపారు. ఖమ్మంలోని వర్తక సంఘం భవన్‌లో 30వ జాతీయస్థాయి కరాటే పోటీలు వచ్చే నెల 1నుంచి జరుగుతున్నట్లు తెలిపారు. నల్లగొండ జిల్లా నుంచి అండర్–10 నుంచి 10మంది బాలబాలికలు, అండర్–14 నుంచి 10 బాలబాలికలు ఎంపికయ్యారు. వారిలో హయతి, రూప, హర్షిత్ కుమార్, మాధవ్‌సాయి, తేజస్వనీ,వీణ, ధరణి, శ్రీ జ్ఞానదీప్, లాస్యప్రియా, గాయత్రి, శివ శంకర్, విజయలక్ష్మి, తణ్మయి, నిఖిల్ ఎంపికయ్యారు. చిన్నారులను స్థానిక నాయకులు సుధాకర్, ప్రముఖ క్రీడాకారులు అభినందించారు.

రేషన్ పంపిణీలో ఇబ్బందులు ఉండొద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ హేమలత

వేములపల్లి : మండలంలోని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బియ్యాన్ని పంపిణీ చేయాలని తహసీల్దార్ హేమలత డీలర్లకు సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు రేషన్ కోసం ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశ్యంతో మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని జూన్ నెలలోనే అందిస్తున్నందున డీలర్లు దుకాణాల్లో అందుబాటులో ఉండి బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. మూడు నెలల బియ్యం పంపిణీ విషయంపై గ్రామాల్లో డప్పు చాటింపు వేయించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీటీ కోటేశ్వరి, ఆర్‌ఐలు మహేందర్‌రెడ్డి, స్పందన, డీలర్లు కందిమళ్ల సుధాకర్‌రెడ్డి, పాండురంగయ్య, కృష్ణమూర్తి, నాగేశ్వర్‌రావు, గురవయ్య, సతీష్‌రెడ్డి, లచ్చయ్య, రవి, సంతోష్ పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



రాగడపలో పౌర హక్కులపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఐ సైదులు

త్రిపురారం : రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్‌ఐ సైదులు అన్నారు. శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని రాగడపలో గిరిజన కాలనీలో గ్రామస్తులకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ సైదులు మాట్లాడారు. ప్రతి మనిషికి రాజ్యాంగం పరంగా జీవించే హక్కు ఉందని ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగినంత వరకు స్వేచ్ఛను ఉపయోగించుకోవచ్చన్నారు. పౌరుల హక్కులకు భంగం కలిగిస్తే నేరమన్నారు. హక్కులు ఎంత ముఖ్యమో బాధ్యతలు కూడా అంతే ముఖ్యమన్నారు. పిల్లలను పనులకు పంపడం, బాల్య వివాహలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థలు, మూఢనమ్మకాలు, చట్టంలోని శిక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్లవి, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి మాదిగలకు ఇవ్వాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని మాదిగలకు కేటాయించాలని పలువుర మాదిగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జనరల్ స్థానంలో రెడ్డిలు, ఆ తరువాత బీసీలు మండల అధ్యక్ష పదవిని చేపట్టారు కాని ఇప్పటివరకు ఎస్సీ మాదిగలకు మండల అధ్యక్ష పదవి కేటాయించలేదన్నారు. దామరచర్ల మండలంలోని మాదిగలు పార్టీని నమ్ముకొని కాంగ్రెస్ జెండా మోశారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్ఠానం మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవిని ఎస్సీ మాదిగకు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో కొమ్ము దాసు, ఆకారపు గోపాల్, సదానందం, నాగేశ్వర్‌రావు, నగేష్, వసంతకుమార్, రాజేష్, శంభయ్య, ఈశ్వర్, రవికుమార్, కొమ్ము రాజేష్, కాశయ్య, శ్రీను పాల్గొన్నారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



త్రిపురారం భవిత కేంద్రంలో ఫిజియోథెరపిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రమీల

త్రిపురారం : దివ్యాంగ విద్యార్థులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి త్రిపురారం తహసీల్దార్ గాజుల ప్రమీల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగా విద్యార్థులకు అందిస్తున్న ఫిజియోథెరపిని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ ప్రమీల మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాను సారం ప్రత్యేక అవసరాలు కల విద్యార్థులకు (చిల్డ్రన్స్ విత్ స్పెషల్ నీడ్స్) అవసరాలు గల విద్యార్థులకు వసతులు కల్పించాలి సూచించారు. విద్యార్థులకు అన్ని విదాలుగా సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో త్రిపురారం ఎంఈఓ రమావత్ రవి నాయక్, జాని పాష, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వామి కల్యాణం



కల్యాణం సందర్భంగా బోనాలతో వెళ్తున్న మహిళలు

వేములపల్లి : మండలంలోని రావులపెంట గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు బ్రహ్మశ్రీ వారణాసి ఉదయ్‌భాస్కర్‌శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అవిరెండ్ల సైదులు ఇంటి నుంచి అమ్మవారికి పసుపు కుంకుమ తోపాటు గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వచ్చి స్వామివార్లకు సమర్పించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. అనంతరం పోలెబోయిన కోదండపాణి సీతమ్మ దంపతుల /జ్ఞాపకార్థంగా వారి కుమారులు అన్నదానం చేశారు. జాతర సందర్భంగా ఆలయ పరిసరాల్లో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు జిన్నె నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అవిరెండ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

నిడమనూరు : నిడమనూరు ఎస్‌ఐగా కొత్తగా వచ్చిన ఎస్‌ఐ ఉప్పు సురేశ్‌ను మున్నూరుకాపు సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. నిడమనూరు రాగానే నెలరోజులపాటు శిక్షణ పూర్తిచేసుకొని రాగా, సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. విధుల్లో రాణించి, ప్రశంసలు పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కలకోట కొండలు, ప్రధాన కార్యదర్శి జిల్లపల్లి బాలకోటి, మెరుగు మధు, బండారు సైదయ్య, సుంకరి రాంబాబు, బుత్తుల సూరయ్య, తిరుపతిరావు, కొత్తపల్లి యాదగిరి, ఆవుల నరేందర్, సలాది నాగయ్య, కొండారు చంద్రశేఖర్, మోరా శంకర్, కావేటి రాము, తదితరులు ఉన్నారు.

జూన్ 2న చెత్త సేకరణ వాహనాలు ప్రారంభం

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో పారిశుద్ధ్యన్ని మెరుగుపరిచేందుకు రూ. 1.50కోట్ల వ్యయంతో 12 చెత్త మినీ ట్రక్కులు, 6 చెత్త ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. జనవరి 2024 మున్సిపల్ పాలక మండలి అఖరీ సమావేశంలో చెత్త వాహనాలు కొనుగోలుకు కౌన్సిల్ తీర్మానం చేసి ఆన్‌లైన్ టెండర్లు వేశారు. మొత్తం 48 వార్డులుండగా ఆయా వార్డుల్లో మొత్తం 45మినీ చెత్త వాహనాలుండగా ఆయా వార్డుల్లో సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించి కొంత మేరకు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచారు. మరో 12చెత్త మినీ ట్రక్కులతో పాటు ఆరు చెత్త ట్రాక్టర్ల రావడంతో మరింత మెరుగు పడే అవకాశం ఉంది. ఈ మినీ ట్రక్కు ఆటోలను తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవం రోజు జూన్ 2న స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించేందుకు మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టూటౌన్: టాలెంట్ టెస్ట్‌ల పేరుతో విద్యార్థులను వేధిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా నాయకుడు ఆవుల సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సాగర్ రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో రెసోనెన్స్ స్కూల్స్ నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌ను ఏబీవీపీ నాయకులు అడ్డుకున్నారు అనంతరం ఎంఈఓ అరుంధతి అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయి, శివ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నల్లగొండ టౌన్: ఉపాధి హామీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ కలెక్టర్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం లేకుండా చేయడానికి కుట్ర చేస్తోందని, దాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత వ్యవసాయ కార్మికులపై ఉందన్నారు. సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఓ మోతిలాల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బొజ్జ చిన్న వెంకులు, దండంపల్లి సరోజ, కత్తుల లింగస్వామి, చింతపల్లి మారయ్య, గండమల్ల రాములు, పెంటమల్ల సుకన్య, మన్నె భిక్షం పాల్గొన్నారు.

చినుకు పడితే జలమయం



మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్ ముఖ ద్వారం వద్ద నిలిచిన వర్షపు నీరు

మిర్యాలగూడ పట్టణంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద వర్షపు నీరు నిల్వ ఉండటంతో చిత్తడిగా మారింది. చిన్న వర్షానికి బస్టాండ్ ముఖ ద్వారం వద్ద నీరు నిలిచి ఉండటంతో బస్సుల రాకపోకలతో గుంతల మయంగా మారింది. దీంతో బస్సుల రాకపోకలకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికే ఈ విషయంపై ఆర్టీసీ ఆర్ఎం దృష్టికి కాంప్లెక్స్ నిర్వాహకులు, ప్రయాణికులు తీసుకెళ్లగా సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. – మిర్యాలగూడ టౌన్

శాంతియుతంగా బక్రీద్ జరుపుకోవాలి : ఎస్పీ

నల్లగొండ: బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మత పెద్దలతో శుక్రవారం నిర్వహించిన శాంతి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈద్గా ప్రాంతాల్లో సామూహికంగా ప్రార్థన కోసం వచ్చే ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్, పార్కింగ్, పోలీస్ బందోబస్తు ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. సరిహద్దు రాష్ట్రాల మీదుగా వచ్చే పశువుల అక్రమ రవాణా కట్టడికి జిల్లా పరిధిలో పోలీస్ శాఖ, పశు సంవర్ధక శాఖ సిబ్బంది సమన్వయంతో చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులు అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజల ఐక్యత, సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు, రెచ్చగొట్టే, అసభ్యకర పోస్టులు పెట్టి శాంతి భద్రతల సమస్య సృష్టించే వారిపై సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ నిఘా పెట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, టూటౌన్ సీఐ రాఘవరావు, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

జూదం స్థావరంపై పోలీసుల దాడులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందిపాడులో గల ఓ నివాసంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం మేరకు మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. జూదం ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద 12 సెల్‌ఫోన్లు, 9 ద్విచక్రవాహనాలు, 104 ప్లేయింగ్ కార్డులతో పాటు 9 చైర్స్, ఒక టేబుల్, గ్రౌండ్ షీట్, రూ.54 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.